పెద్దదర్గా ఉరుసుకు డిప్యూటీ సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రసిద్ధిగాంచిన కడప పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు హాజరుకావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ, నిర్వాహకులు ఆహ్వానించారు. బుధవారం విజయవాడలో డిప్యూటీ సిఎంను కలిసి వారు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. నవంబర్ 3 నుంచి పెద్దదర్గా ఉత్సవాలు ప్రారంభవుతాయి. 16వ తేదీన గంధం, 17న ఉరుసు, 18న ముషాయిరా ఉంటాయి.

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న పీఠాధిపతి ఆరిఫుల్లా

ఏకధార

- 2,024.2 ఎకరాల్లో నేలకొరిగిన వరి
- ఉల్లి పంటలో వర్షపునీరు నిల్వ
- రైల్వేకోడూరులో ఉప్పొంగిన వాగులు
- అత్యధిక వర్షపాతం 134 మి.మీ
- నేడు, రేపూ ద్రోణి ప్రభావం?!

ఉభయ జిల్లాలో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. ఆకాశానికి ధారం కట్టిన చందాన్ని తలపిస్తోంది. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం కారణంగా సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉపరితలద్రోణి ప్రభావం కొనసాగే అవకాశాలు ఉన్నాయనే వాతావరణశాఖ హెచ్చరిక ఆందోళన కలిగిస్తోంది. సోమవారం తెల్లవారుజాము నుంచి బుధవారం వరకు అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో 134 మి.మీ, కడప జిల్లా పోరుమామిళ్లలో 90 మి.మీపైగా వర్ష పాతం నమోదైంది. ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాల్లోని లోతట్టు ప్రాంతా ల్లోకి నీరు చేరడంతో పాటు పలుప్రాంతాల్లో వరి, ఉల్లి పంట నేలకొరగడం ఆందోళన కలిగిస్తోంది. కడప జిల్లాలో జిల్లాలో 2024.2 ఎకరాల్లో వరి, 254.5 ఎకరాలలో మినుము పంటలు నేలకొరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్ సాగుకు ఆశావహమైన రీతిలో వర్షపాతం నమోదు కావడం ఉపశమనాన్ని కలిగిస్తోంది.

ప్రజాశక్తి-కడప ప్రతినిధి/రాయచోటి

జిల్లాల్లో అల్పపీడన ద్రోణి ప్రభావం కొనసాగుతోంది. అన్నమయ్య జిల్లాలో మోస్తరు వర్షపాతం నమోదైంది. రాజంపేట డివిజన్ పరిధిలోని రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లి, రాజంపేట మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. రైల్వేకోడూరులో అత్యధికంగా 134 మి.మీ వర్షపాతం నమోదైంది. ఫలితంగా వాగులు, వంకలు ఉప్పొంగాయి. రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లో వరి, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ఇటు వంటి పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయాధికారులు నేలకొరిగిన వరి పంటలను పరిశీలించడంపై దృష్టి సారించారు. శెట్టిగుంట పరిధిలోని జానకీపురం, శ్రీనివాసపురం గ్రామాల్లోకి వరదనీరు చేరింది. కలెక్టర్ అప్రమత్తమై డివిజన్ కేంద్రాల్లో పర్య వేక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి పునరావాస సహాయక చర్యలు చేపట్ట డంతో ఉపశమనాన్ని కలిగి స్తోంది. కడప జిల్లాలోని బద్వేల్ డివిజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదైంది. పోరు మామిళ్ల, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమ నార్హం. దీంతోపాటు పులివెందుల, ప్రొద్దుటూరు డివిజన్ల పరిధిలో సాగు చేసిన వరి, ఉల్లి పంటల్లోకి వర్షపునీరు చేరడం ఆందోళన కలిగిస్తోంది. మిగిలిన బుడ్డ శనగ, వేరుశనగ, మినుములు, పత్తి, సోయామీన్ పంటలకు ఉపశమనం కలిగిస్తుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కడప, అన్నమయ్య జిల్లాలో రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, పులివెందుల నియోజకవర్గాల్లో పండ్ల తోటలతో సహా వేరుశనగ తదితర పంటలను పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ నిరాశ కలిగించిన నేపథ్యంలో తాజాగా ఏర్పడిన అల్పపీడనద్రోణి రబీ సీజన్ కలిసి వచ్చే అవకాశంపై రైతులు ఆశలు పెంచుకున్న నేపథ్యం కనిపిస్తోంది.

వేంపల్లె : వి.ఎన్.పల్లె వద్ద తెగిన లోలెవల్ కాజ్‌వే

పదును దాటని వర్షం : జిల్లాలో పదును వర్షపాతం నమోదు కావడం గగనంగా మారింది. కడప జిల్లాలో పోరుమామిళ్ల, అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లి, రాజంపేట, నందలూరు మండలాల్లో ఆశాజనక వర్షపాతం నమోదు కావడం మినహా మిగిలిన మండలాల్లో మోస్తరు వర్షపాతానికి పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. మరో రెండు రోజులు ఉపరితలద్రోణి ప్రభావం కొనసాగనున్న నేపథ్యంలో ఏమేరకు లాభాన్ని, నష్టాల్ని కలిగిస్తుం దో వేచి చూడాలి. సోమవారం ఉదయం నుంచి కడప, బద్వేల్, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గ ప్రాంతాల్లో మోస్తరు జల్లుతో సరిపెట్టింది. ఫలితంగా కడప జిల్లా వ్యాప్తంగా 3.76 లక్షల ఎకరాల్లో 2.80 లక్షల ఎకరాల వరకు బీళ్లుగానే మిగిలిపోయాయి.

బుడ్డశనగ సాగు ప్రశ్నార్థకం! : జిల్లాలోని 26 నుంచి 33 మండలాల్లో బుడ్డశనగ సాగవుతోంది. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో బుడ్డశనగ, వేరుశనగ, పత్తి, మినుములు, సోయాబీన్ ప్రధాన పంటల సాగుకు అవసరమైన వర్షపాతం నమోదు అవుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. 2024-25 రబీ సీజన్ సాగులో నూనె గింజల ఆధారిత అత్యధిక వాటా వీటిదే. ఇందులో గతేడాది తరహాలోనే బుడ్డ శనగ సుమారు 2,32,360 లక్షల ఎకరాలు, 22,915 వేల ఎక రాల్లో మినుము పంట గణనీయంగా సాగవుతోంది. వేరుశనగ, పత్తి, సోయాబీన్ పంటలు గణనీయమైన సంఖ్యలో సాగుతుండడం తెలిసిందే. ప్రతి ఏటా అక్టోబర్ ఒకటి నుంచి ఆశాజనకంగా వర్షపాతం నమోదు కావడం తెలిసిందే.

కడప : అప్సర మార్గంలో రోడ్లపై నిలిచి ఉన్న వర్షపు నీరు

లోతట్టు ప్రాంతాలు జలమయం

కడప అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వల్ల కడప నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురు స్తూ ఉంది. లోతట్టు ప్రాంతాలలోని రోడ్లు, డ్రెయినేజీ కాలువల్లో వర్షపు నీటితో పాటు, మురుగు నీరు పొంగి ప్రవహిస్తూ ఉంది. ఆర్టీసీ బస్టాండ్, వై.జంక్షన్ నుంచి అప్సరా సర్కిల్ వరకు ఉన్న రోడ్లపై వర్షపు నీరు నిలిచాయి. వాహన దారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు ఎక్కడికక్కడ డ్రెయినేజీ కాలువలను శుభ్రం చేయ డంతో రోడ్లపై వర్షపు నీరు కొంత వరకు తగ్గుముఖం పట్టింది. ఆర్టీసీ బస్టాండులో వర్షపు నీరు నిలవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర విభాగంలో పనిచేసే ఉద్యోగులు వర్షం కారణంగా కార్యాలయాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు. ప్రజలకు వర్షం వల్ల ఎలాంటి ఇబ్బందులు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు వర్షపు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం ఉదయం నుంచి కార్మికులను అప్రమత్తం చేస్తూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా కొంతవరకు చర్యలు తీసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ కాలువలు పూరైన, మధ్య మధ్యలో పెండింగ్ ఉండడం వల్ల వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. రెండు నెలలుగా ఎండ వేడిమిని భరించలేక అల్లాడుతున్న ప్రజలకు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఫలితంగా వర్షాలు కురవడంతో కొంత ఉపశమనం లభించింది. మరో రెండు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ కేంద్రం హెచ్చరికలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. తోపుడు బండ్లు వ్యాపారులు, ఫుట్ పాత్‌పై వ్యాపారం చేసుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కడప : ఆర్‌టిసి బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీరు

కడప : జలమయమైన కృపా కాలనీ

వర్షపు నీరు తొలగించేందుకు చర్యలు: అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం మార్నింగ్ విజిట్‌లో భాగంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అశోక్ నగర్, అప్సర సర్కిల్ నుంచి వై.జంక్షన్ వరకు, గురుకుల్ విద్యాపీఠ, వినాయక నగర్ సర్కిల్ ప్రాంతాల్లో నీటి నిలువులను పరిశీ లించారు. ఆయా ప్రాంతాల్లో నీరు నిలువ ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టారు. మిషన్ సహాయంతో నీటిని తొలగించే ప్రక్రియలను వేగవంతం చేయాలని, నీరు నిలువకుండా తక్షణమే పరిష్కార మార్గాలను అమలు చేయాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కడప కోర్టు వద్ద నుంచి ఆర్టీసీ సర్కిల్ వరకు ఉన్న నీటిని కూడా వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధనలక్ష్మి, నారాయణస్వామి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జెసి

కడప: తుపాను కారణంగా జిల్లాలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముందస్తుగా తీసుకున్న చర్యలు తీసుకోవలసిన చర్యలపై జిల్లా స్థాయి అధికారుల నుండి మండల స్థాయి అధికారుల వరకు విసి ద్వారా జేసి సమీక్షించి తగు ఆదేశాలను జారీ చేశారు. ముందుగా ఆయా శాఖల అధికారులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా ముందస్తు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని, టామ్ టామ్ లేదా మైకుల ద్వారా ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అధికారులు అందరూ పనిచేసే స్థానంలోనే అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు ఆగిపోయే వరకు సెలవులు మంజూరు చేయమన్నారు.న ఎవరైనా సెలవుల్లో ఉంటే ఆ సెలవులని రద్దు చేసుకుని విధులకు హాజరు కావాలన్నారు.

చాపాడు : నీట మునిగిన వేరుశనగ పంట

కంట్రోల్ రూమ్ నెంబర్లు : కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూంతో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్లు కలెక్టరేట్ కార్యాలయం, కడప కంట్రోల్ రూమ్ : 08562-246344, కడప ఆర్‌డిఒ కార్యాలయం: 89854 29256, జమ్మలమడుగు : 9618804882, బద్వేలు : 917013323862, పులివెందుల : 85200 82425, 95422 99885.

పోరుమామిళ్లలో 90.4 మి.మీల వర్షపాతం : పోరుమామిళ్లలో అత్యధికంగా 90.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుండి బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కడపలో 43.6, ఖాజీపేటలో 38.4, కమలాపురంలో 40.8, వల్లూరులో 29.6, చెన్నూరులో 30.4, ఒంటిమిట్టలో 49.8, సిద్ధవటంలో 35.8, చింతకొమ్మదిన్నెలో 45.8, పెండ్లిమర్రిలో 41.8, మైదుకూరులో 23.0, బి.మటంలో 48.6, క్రాశినాయనలో 65.8, కలసపాడులో 56.8, బి కోడూరులో 44.2, బద్వేలులో 29.0, గోపవరంలో 30.2, అట్లూరులో 33.8, కొండాపురంలో 25.6, మైలవరంలో 23.4, పెద్దముడియంలో 51.6, రాజుపాలెంలో 42.4, దువ్వూరులో 49.6, చాపాడులో 22.2, ప్రొద్దుటూరులో 36.2, జమ్మలమడుగులో 35.4, ముద్దనూరులో 28.0, ఎర్రగుంట్లలో 21.6, సింహాద్రిపురంలో 30.4, లింగాలలో 25.2, పులివెందులలో 30.2, వేములలో 29.8, తొండూరులో 34.6, వివిఎన్.పల్లిలో 27.2, వేంపల్లిలో 35.8, చక్రాయపేటలో 31.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

చెరువులను తలపిస్తున్న కాలనీలు : నగర శివారులోని కృపా కాలనీ, బుడగజంగం కాలనీ, ఎస్‌బిఐ కాలనీ, లోహియా నగర్, యానాది కాలనీ, అహ్మదీయ నగర్ చెరువులను తలపిస్తున్నాయి. డ్రెయినేజీ కాలువ పనులు ఆగిపోవడం వల్ల పైప్రాంతాల నుంచి వచ్చిన ఈరు ఆయా కాలనీల్లోకి చేరుతోంది. పెండింగ్‌లో ఉన్న డ్రెయినేజీ కాలువలు, సిసి రోడ్ల పనులు పూర్తి చేస్తే ఈ సమస్యలకు పరిష్కారం లభించి ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రజలు కోరుతున్నారు.

చెన్నూరు : నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

నేలకొరిగిన వరి పంట

చెన్నూరు:రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెన్నూరు. రామనపల్లి. కొండపేట, పలు ప్రాంతాల్లో వరి పంట నేలకొరిగింది. పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెన్నా నది ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో కుందూ, పాపాగ్ని ఒక్కిలేరు చిన్నపాటి వంకలనుంచి వరద నీరంతా పెన్నా నదిలోకి చేరుతున్నది. బుధవారం సాయంత్రానికి చెన్నూరు వద్ద పెన్నా నదిలో 21 వేల క్యూసెక్కులు నీరు దిగువనున్న సోమశిల జలాశయంలోకి చేరుతున్నాయి. చెన్నూరు వద్ద సెంట్రల్ వాటర్ సిబ్బంది నీటి వేగాన్ని పరిశీలిస్తున్నారు. ఆదినిమ్మాయిపల్లి పెన్నా నది ఆనకట్ట వద్ద కెసి కెనాల్ అధికారులు ఎప్పటికప్పుడు నేటి ప్రవాహాన్ని అంచనా వేస్తున్నారు. మైలవరం జలాశయం నుంచి నీటిని వదలడంతో పెన్నా నది పరిసర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. చెన్నూరు, భవన్ నగర్, బుడ్డాయిపల్లి. కొత్త రోడ్డు, పలు కాలనీలలో వర్షంనీరు చేరింది. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సిఐ పురుషోత్తం రాజు, తహశీల్దార్ సరస్వతి, మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి ఆయా ప్రాంతాల్లో పంటలను పరిశీలించారు.

కొట్టుకుపోయిన వంతెన..రాకపోకలు బంద్

వేంపల్లె : వీరపనాయనిపల్లి మండలంలోని బుసిరెడ్డిపల్లెలో వరద ఉధృతికి వంక బ్రిడ్జి కొట్టుకుపోయింది. ఆయా ప్రాంతాల్లోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుసిరెడ్డిపల్లె నుంచి వీరపునా యునిపల్లెకు రావాలంటే వేంపల్లి మండలం రామిరెడ్డిపల్లె నుంచి పల్లెల మీదుగా 20 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తోంది. జిఎన్ఎస్ఎస్ కాలువ నీటి తోపాటు వర్షపు నీరు చేరడంతో వంక వంతెన తెగిపోయిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

వేముల : నీట మునిగిన ఉల్లి పంటను చూపుతున్న రైతు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని ఇప్పపెంట పంచాయతీ బూడోద్దులపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సిసి రోడ్లు వేసే ముందు కచ్చితంగా డ్రెయినేజీ కాలవలు ఉండాలని అధికారులకు తెలిపారు. వర్షం వలన వరి పంటలు దెబ్బతిని నష్టపోయామని సహాయం చేయాలని ఆయనను రైతులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులకు తెలిపి ఎంత నష్టం కలిగిందో నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి ఏడాది గ్రామసభ నిర్వహించుకుని అందులో గ్రామానికి కావాల్సిన అత్యవసర పనులను ప్రజలందరూ కలిసి తీర్మానం చేసుకొని ఒకదాని తర్వాత ఒకటి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగేశ్వరరావు, ఎంపిడిఒ ఎం.కులాయి బాబు, ఎపిఒ రామానుజన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం మోహన్ బాబు, మండల టిడిపి అధ్యక్షుడు టి.వి.కృష్ణారెడ్డి, బాషా, హబీబ్ ఖాన్, మున్నా, వీరకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రయివేట్ ట్రావెల్స్ దోపిడీని అరికట్టాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-బద్వేలు : ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని దోపిడీ చేస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ యజమాన్యాలపై చర్యలు తీసుకుఓవాలని డివైఎఫ్ఐ జిల్లా జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సీజన్‌లో ప్రజల అవసరాలను అవకాశంగా తీసుకుని జిల్లాలో ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ప్రజల వద్ద నుంచి అధిక రీతిలో ఛార్జీలు వసూలు చేస్తున్నా రన్నారు. పండుగ పూట రావాలన్నా, తిరిగి వెళ్లాలన్నా ప్రజలు భయపడే రీతిలో ట్రావెల్స్ యజమానులు ఛార్జీలు వసూలు చేస్తున్నారయని పేర్కొన్నారు. విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఛార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. యథేచ్ఛగా ఆన్‌లైన్‌లోలోనే అధిక మొత్తంలో ధరలు చూపిస్తున్నా రవాణా శాఖ అధికారులు పట్టించుకోలేదు అంటే ఏ స్థాయిలో నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం అవుతుందన్నారు. కేవలం రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇదంతా జరుగుతుందన్నారు. ఇప్పటికైనా స్పెషల్ డ్రైవ్ నిర్వ హించి ఇటువంటి ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో డివైఎఫ్ఐగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్కే అదిల్, మహిళా కన్వీనర్ కో-కన్వీనర్ నాగలక్ష్మి, ఫాతిమా, ఉపాధ్యక్షులు యువరాజ్, ఖలీల్ పాల్గొన్నారు.

తెలంగాణకే కడప కలెక్టర్!

ప్రజాశక్తి-కడప ప్రతినిధి : కడప కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలంగాణ రాష్ట్రానికి వెళ్లే అవకాశం కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిబంధనల పేరుతో కలెక్టర్ తెలంగాణకు వెళ్లి పనిచేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. రాష్ట్రానికి చెందిన ముగ్గురు ఐఎఎస్ అధికారులు తెలంగాణ స్థానికత నమోదు చేసుకున్న కారణంగా నిబంధనల కారణంగా వెళ్లాల్సి ఉందని కేంద్రం పేర్కొన్న సంగతి తెలిసిందే. ఐఎఎస్ అధికారులు క్యాట్‌ను ఆశ్రయించారు. బుధవారం న్యాయవాదుల వాదోపవాదాలను విన్న న్యాయస్థానం కేంద్రం ఆదేశాలను పాటించాలని ఆదేశించింది. ఐఎఎస్ అధికారుల న్యాయవాదుల విన్నపం మేరకు ఎనిమిదో తేదీ నాటికి వాయిదా వేసింది. కేంద్రం నిబంధనలు, కోర్టుల స్పష్టత అర్థమైన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అభ్యర్థించినప్పటికి సాధ్యపడని పరిస్థితి ఏర్పడింది. స్పష్టమైన జిఒ విడుదల కాగానే తెలంగాణ రాష్ట్రానికి వెళ్లడానికి సిద్ధపడినట్లు తెలుస్తోంది.

స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20వ తేదీ కడప యుటిఎఫ్ భవన్‌లో స్వర్ణోత్సవ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో స్వర్ణోత్సవ మహాసభలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. స్వర్ణోత్సవ మహాసభలను పురస్కరించుకుని జిల్లాలో ఇప్పటికే పలు క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహించామని తెలిపారు. ఈ మహాసభలలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించి, సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాట కర్తవ్యాలను రూపొందించనున్నామని పేర్కొన్నారు. పాలకవర్గాలు ప్రభుత్వ విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ప్రాథమిక విద్యను నిర్వీర్యపరుస్తూ విద్యను ప్రయివేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఎన్నికలకు ముందు పాలకులు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై హామీలు ఇస్తున్నారు తప్ప పరిష్కారంలో చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. వీటిపై చర్చించి సమస్యల సాధన కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్మించేందుకు ఈ మహాసభలను వేదికగా చేసుకోబోతున్నామన్నారు. ఈ సభలకు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతోటి, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని వివరించారు. ఈ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, కడప నగర అధ్యక్షుడు ఎల్.కరీముల్లా, నాయకులు పెంచలయ్య, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్‌టిసికి దసరా ఆదాయం రూ.59.38 లక్షలు

ప్రజాశక్తి-కడప అర్బన్: దసరా పండుగ పురస్కరించుకుని వివిధ డిపోల నుంచి ప్రధాన నగరాలకు, మున్సిపాలిటీలకు, గ్రామాలకు ప్రజలను సురక్షిత రవాణా కల్పించడం ద్వారా ఆర్టీసీకి రూ.59,38,002 ఆదాయం లభించింది. ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు 283 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. విజయవాడకు 26 బస్సుల ద్వారా రూ.8,77, 015 లక్షలు, బెంగళూరుకు 69 బస్సుల ద్వారా రూ.16,21,619 లక్షలు, హైదరాబాద్‌కు 54 బస్సులు ద్వారా రూ.15,76,594 లక్షలు, చెన్నైకి 11 బస్సుల ద్వారా రూ.3,38,078 లక్షలు, తిరుపతికి 46 బస్సుల ద్వారా రూ.8,68,022 లక్షలు, కర్నూలుకు 8 బస్సుల ద్వారా రూ.1,52,956 లక్షలు, ఇతర ప్రాంతాలకు 24 బస్సులు ద్వారా రూ.5,03,718 లక్షలు ఆదాయం ఆర్టీసీకి లభించింది. ఆర్టీసీలో ప్రయాణం చేసిన ప్రజలకు ఆర్ఎం గోపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వైవీయూ పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వ విద్యాలయంలో ఎంఎ, ఎంఎస్సీ, ఎంకాం, ఎంపీఇడీ కోర్సులలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు నేరుగా అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, 2 సెట్ల జిరాక్స్ కాపీలు, నిర్ణీత ఫీజుతో విశ్వ విద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలామ్ ప్రాంగణంలోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో హాజరు కావాలని పేర్కొన్నారు. ఏపీపీజీసెట్-2024 ఎంట్రన్స్ రాసి అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులని తెలిపారు. వివరాలకు yvu.edu.in అనే వెబ్సైట్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఎంఎ, ఎంఎస్సీ, ఎంకాం,ఎంపీఈడీ సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలు.. ఇంగ్లీషు-35బీ తెలుగు-39, ఉర్దూ-26, జర్నలిజం-33, హిస్టరీ-29, పొలిటికల్ సైన్స్-26, ఎకనామిక్స్-41, కామర్స్-37, బయో కెమిస్ట్రీ-21, బయోటెక్నాలజీ-5, మైక్రో బయాలజీ-5, జెనెటిక్స్ సెండ్ జీనోమిక్స్-29, ఎన్విరాన్మెంటల్ సైన్స్-31, బోటనీ-16, జువాలజీ-6, మ్యాథ్స్-38, ఫిజిక్స్-26, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ-34, కెమిస్ట్రీ-9, జియాలజీ-26, సైకాలజీ-24, ఫిజికల్ ఎడ్యుకేషన్-38, ఫుడ్ టెక్నాలజీ-22బీ కంప్యూటర్ సైన్స్-13, కాంపిటేషనల్ డేటా సైన్స్-27 ఖాళీలు ఉన్నాయన్నారు.

విద్యార్థికి అవార్డును అందజేస్తున్న ప్రిన్సిపల్ సురేఖ, డాక్టర్ జ్యోతి

రాష్ట్రంలో శాంతిభద్రతలు ఖూనీ : వైసిపి

ప్రజాశక్తి-కడప

చంద్రబాబు నాయకత్వంలో ఈ రాష్ట్రం ఎటు వెళ్తుందో, ఏమైపోతుందో అనే ఆందోళన కలుగుతోందని వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మళ్ళీ జైలుకు పోక తప్పదన్నారు. చంద్రబాబును ఆనాడు అరెస్టు చేస్తే పెద్ద ఎత్తున గగ్గోలు పెట్టారన్నారు. అన్యాయంగా అరెస్టు చేశారంటూ భార్య, పిల్లలు, దత్తపుత్రుడు అంతా గోల చేశారన్నారు. ఇప్పుడు స్కిల్ అక్రమాలు చంద్రబాబు కనుసన్నల్లోనే జరిగిందని తేలిందని తెలిపారు. పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేసేందుకు చంద్రబాబు పెద్ద స్కెచ్ వేశారన్నారు. షెల్ కంపెనీలతో రూ.370 కోట్లు కొట్టేసి నిరుద్యోగులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవన్నారు. ఇసుక, మద్యంలో దోచేసుకుంటున్నారు పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వంలో ఉన్న ఇసుక డంప్‌ను అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే కాళీ చేసేసారన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, నిత్యానందరెడ్డి పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - బద్వేలు

యుటిఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం బాలుర ఉన్నత పాఠశాలలో మండల మహాసభ నిర్వహించారు. మండల గౌరవాధ్యక్షులుగా సుబ్బరాజా, అధ్యక్షులుగా ఎస్.దేవానందం, సహాధ్యక్షులుగా ఎం.నరేష్, సి.శివ భారతి, కార్యదర్శి కె.సుధాకర్, ట్రెజరర్‌గా ఎ.గుర్రయ్య, కార్యదర్శులుగా బి.వి.శ్రీనివాసులరెడ్డి, ఎం.గుర్రయ్య, ఆర్.రాజా, ఎన్.శ్రీధర్‌రెడ్డి, ఎన్.విజయభాస్కర్, సాహిత్య సుధారాణి, శ్రీకాంత్, టి.పెంచలయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు మాదన విజయకుమార్ డి.గురుప్రసాద్, టి.శివప్రసాద్, ఎస్.దేవానందం, కె.సుధాకర్, పాలా శ్రీనివాసులరెడ్డి, పి.చక్రపాణి, పి.మస్తాన్‌రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎన్.పవన్ కుమార్, సభ్యులు ఎస్.గౌస్ బాషా, కె.మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డి.గురు ప్రసాద్, ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఓబుల్‌రెడ్డి వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.దేవానందం, కె.సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగ వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

ఎపిటిఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షులుగా ప్రసాద్

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఎపిటిఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షులుగా కడప జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)గా పనిచేస్తున్న సి.వి.ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అన్నమయ్య జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్ (పిఎస్) బి.రాధాకృష్ణను ఎన్నుకోవడం పట్ల ఎపిటిఎఫ్ అమరావతి కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఆలీఖాన్, చెంగలరెడ్డి, ఉమాకాంత్ హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తులు ఫెడరేషన్‌కు ఎన్నుకోవడం పట్ల సమస్యల పరిష్కారంకు నాంది పలుకుతుందని తెలిపారు. జిఒ 117 రద్దు, పిఆర్‌సి, ఐఆర్, పెండింగ్ బకాయిలు, పదోన్నతుల్లో అసంబద్ధాలు, సిపిఎస్ రద్దు మొదలగు సమస్యలపై ప్రభుత్వంతో ప్రాతినిధ్యాలు చేస్తూనే పోరాటాలకు శ్రీకారం చుడదామని నూతన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, రాధాకృష్ణ తెలిపారు. త్వరలో సిపిఎస్ రద్దు గుర్తుకు తెస్తాం కార్యక్రమాన్ని ఉపాధ్యాయుల్లోకి తీసుక పోనున్నట్లు తెలిపారు.

కొర్రపంటను పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

పంటల్లో నీరు నిల్వ ఉంచరాదు

ప్రజాశక్తి - ముద్దనూరు

తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినకుండా పొలాల్లోని నీటిని బయటకు పంపాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని యామవరం గ్రామంలో సాగులో ఉన్న కొర్ర పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ వర్షపునీరు పొలంలో అధికంగా నిలబడితే పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. పొలంలో మురుగునీరు బయటకు పోయేలా కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీరు బయటకు పంపించి పంటలు దెబ్బ తినకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. పంట నూర్పిడి చేసిన, చేస్తున్న రైతులు కలాల్లో ధాన్యం గింజలు వర్షంలో తడవకుండా టార్పాలిన్ పట్టలు కప్పాలని ఎఒ సూచించారు.

గ్రామసభ పత్రాలను తెలియజేస్తున్న ఎఒ శివమోహన్‌రెడ్డి

విత్తన శుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు పంటలసాగులో విత్తన శుద్ధి చేయాలని ఎఒ శివమోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని సుంకేసుల గ్రామంలో బుదవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ విత్తనశుద్ధి చేయడం వల్ల పంటలు తెగులు తట్టుకునే శక్తి ఉంటుం దన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం అసిస్టెంట్ దీపిక, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపిడిఒ ముకుందారెడ్డి

కొలవలిలో సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - ముద్దనూరు

కొలవలి గ్రామంలో బుధవారం ఎంపిడిఒ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ, పల్లె పండుగ వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కొలవలి గ్రామ పంచాయతీలో రూ ఆరు లక్షలతో సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. రోడ్ల పనులకు సర్పంచు మారుతి, మండల ఉపాధ్యక్షురాలు పాలగిరి వీర రేణుక, మాజీ సర్పంచ్ తులశయ్య భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాకేష్ చంద్రంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

వర్షపు నీరు నిలువ లేకుండా చూడండి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో, నగరంలో వర్షపు నీరు నిలువ లేకుండా కాలువల ద్వారా సజావుగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి సూచించారు. నగరంలో పలు ప్రాంతాలలో బుధవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల వల్ల జిల్లాకు వరదలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నీరు నిలవకుండా, డ్రయినేజీ బ్లాక్ అవకుండా ఉండడానికి కావాల్సిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదకర విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా పేర్కొన్నారు. వరల్డ్ ఫుడ్ డే సందర్భంగా బుధవారం మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ఐటి క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్-14 ప్రోగ్రాం అధికారి డాక్టర్ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమతుల్య ఆహరం పట్ల శ్రద్ధ చూపడంతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని కోరారు. ఆహరం తీసుకోవడంలో పాటించే విధి విధాన అంశాలను వివరించారు. మనల్ని నడిపించే శక్తి రూపం ఆహరమన్నారు. ఆరోగ్య అభివృద్ధికి ఆహారం అత్యంత అవసరమని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు విశ్వనాథ్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ దీప్తి, మెంటర్ మధుసూదన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు

ఎడతెరపి లేని వర్షం.. రైతులకు కష్టం

దువ్వూరు : పంట పొలాల్లోకి చేరిన వర్షపునీరు

ప్రజాశక్తి - చాపాడు

మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈ వర్షంతో సాగులో ఉన్న పలు పంటలు దెబ్బతింటాయని రైతుల్లో ఆందోళన నెలకొంది. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఈ వర్షం వల్ల వరి పంటకు మాత్రం సమస్య లేదని రైతులు పేర్కొంటున్నారు. ఉల్లి పంట నూర్పిడి దశలో ఉన్న వారికి మాత్రం తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల క్రితం సాగు చేసిన మినుము, వేరుశనగ పంటలు వర్షంతో వాటి విత్తనాలు కుళ్లిపోతాయని, మళ్లీ పంట సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు చెబుతున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పంటకు మాత్రం నష్టం వాటిల్లితుందన్నారు. మైదుకూరులో 23 మి.మీ.లు, ఖాజీపేటలో 38.4 మి.మీ.లు, దువ్వూరులో 49.6 మి.మీలు, చాపాడులో 22.2 మి.మీ, బ్రహ్మంగారి మఠంలో 48.6 మిల్లీమీటర్లుగా వర్షపాతం నమోదైంది. ఈ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కుందూనది ఉధృతి పెరిగింది. మైదుకూరు మండల పరిధిలో ఉల్లి పంటను నూర్పిడి చేసిన రైతులు నష్టపోవాల్సి వస్తోంది. చేతికి వచ్చిన పంట నీటి పాలవుతుండడంతో దిగాలు చెందుతున్నారు. ఇంతటితో వర్షం తగ్గుముఖం పట్టకపోతే నియోజకవర్గ పరిధిలోని రైతులు చాలావరకు నష్టపోయే ప్రమాదం ఉంది. లోతట్టు ప్రాంతాలు ఎక్కడ చూసినా వర్షపు నీటితో నిండి ఉన్నాయి.

దువ్వూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండలంలో భారీ వర్షాలుపడుతున్నాయి. మంగళవారం రాత్రి నుండి ఎడతెరిపిలేని వర్షం పడుతోంది. కాలువలు, కుంటలు, పంట పొలాలు, రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. అనవసరంగా బయట తిరగొద్దని పిడుగులు పడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఎక్కువ నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో ప్రత్యేక అధికారులతో తగు చర్యలు చేపట్టాలని ఇప్పటికే కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా విపత్తు సంభవిస్తే అధికారులకు తెలపాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మండలంలో అనేక చోట్ల పంట పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. ఇప్పటికే వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, మినుము పంటలు దెబ్బ తింటాయని రైతుల్లో ఆందోళన నెలకొంది. మూడు రోజుల తుఫాను వల్ల ఉల్లి పంట నష్టపోవడంతో ఆ రైతులు లబోదిబో మంటున్న రైతులు

వేముల : తుఫాను వల్ల ఉల్లి పంటలు నష్టపోవడంతో రైతులు అల్లాడిపోతున్నారు. ఉల్లి పంట విత్తన వేసి నప్పటి నుంచి పంట చేతికి వచ్చేసరికి ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి అయిందని లబోదిబోమంటున్నారు. ఉల్లి సాగుకు అప్పు చేశామని, పంట దెబ్బతింటే అప్పు ఎలా తీర్చాలని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పం దించి నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతులు నారుబోయిన రాధాకృష్ణ, యర్రగొర్ల చలపతి, గంగాధర్, చంద్ర, భాస్కర్, రవి కోరుతున్నారు.

పులివెందుల టౌన్ : మంగళవారం రాత్రి నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తుండడంతో జనాలు చలికి వణికిపోతున్నారు. ఈ అల్పపీడనం గురువారం నాటికి చెన్నై సమీపంలో తీరం దాటుతుందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో వైఎస్ఆర్ జిల్లాకు అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతమే నమోదు కావడంతో పెద్దగా నష్టం వాటిల్లలేదు. అక్కడక్కడ వరి పంట నేలవాలింది. భారీ వర్షాలు కురిస్తే నేలవాలిన పంట కుళ్లిపోయే అవకాశం ఉందని రైతుల ఆందోళన చెందుతున్నారు. పత్తి, ఉల్లి రైతుల్లో కూడా ఆందోళన మొదలైంది. ప్రజలు బయటికి రావడానికి వణికిపతున్నారు.

పులివెందుల టౌన్ :వర్షానికి రోడ్లపై నిలిచిన నీరు

అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు..

తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లే అవకాశం ఉందని, అత్య వసరమైతే తప్ప ప్రజలు బయటికి రాకూడదని పోలీసులు సూచించారు. వాగులు, వంకలు దగ్గరకు వెళ్లరాదని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో పోలీసులు అప్ర మత్తమయ్యారు. పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

వేంపల్లె : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వల్ల కురుస్తున్న జడివానతో రోడ్లులన్నీ జలమయం అయ్యాయి. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు అల్లాడు తున్నారు. వేంపల్లెలోని పలు ప్రాంతాల్లో రోడ్లుపై నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. గతంలో వేంపల్లెలో అండర్ డ్రెయినేజీ కోసం గుంతలు తవ్వి విడిచి పెట్టడంతో వర్షపు నీరు నిలిచిపోయింది. బుధవారం ఎడతెరిపిలేని వర్షానికి వ్యాపారస్తులు అల్లాడిపోయారు. రోడ్లపై జనసంచారం తగ్గింది. ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటల్లో వర్షపు నీరు నిలవడంతో రైతుల్లో కూడా ఆందోళన నెలకొంది. పిరమిడ్ నగర్, రాజీవ్ నగర్, ఉషాకిరణ్ పాఠశాల రహదారిలో, కాలనీలో రోడ్లు బురదతో నిండిపోయాయి.

వేంపల్లె: రోడ్లుపై నిలిచిపోయిన వర్షపు నీరు

కుందూ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహశీల్దార్ పి.రమాకుమారి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని కుందూ, పెన్నా నదీ తీర గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ పి.రమాకుమారి సూచించారు. అన్నవరం, సీతారామాపురం గ్రామాల వద్ద కుందూ నది నీటి ప్రవాహాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి నదిలో నీటి ప్రవాహం పెరిగిందన్నారు. అన్నవరం వద్ద బ్రిడ్జికి సమాంతరంగా నీటి ప్రవాహం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తూ ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కుందూ నది తీర గ్రామాల్లో సిబ్బందిని అందుబాటులో ఉండేలా ఆదేశించారు. ప్రజలు కూడా తుఫాన్ ప్రభావం తగ్గే వరకు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్ర మంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఇళ్లు దెబ్బతిన్న వారిని ఆదుకోవాలి

మైదుకూరు(చాపాడు) : మైదుకూరు మండలం నంద్యాలంపేట గ్రామ పంచాయతీ గంగవరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రెండు ఇళ్లు కూలిపోయాయి. బాధితులు ఇళ్లల్లో ఉండేందుకు భయపడి తారుపట్టల కింద తలదాచుకుంటున్నారు. అధికారులు ఎవరు కూడా ఆ గ్రామాన్ని పరిశీలించి వారిని ఆదుకునే ఆలోచన చేయడం లేదని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ పేర్కొన్నారు. బుధవారం ఆయన బాధితులను కలిశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గ్రామపంచాయతీ అధికారులు వెంటనే గంగవరం ఎస్సీ కాలనీలో పర్యటించి దళితులను ఆదుకోవాలన్నారు. అన్ని గ్రామాలలో సిబ్బందితో సర్వే చేపట్టాలన్నారు. తుఫాన్ వల్ల నష్టపోయిన పేదలను ఆదుకోవాలన్నారు.

వైసిపి నుంచి పలువురు టిడిపిలోకి..

పార్టీ కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించిన బీటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డు టిడిపి కార్యాలయ సమీపంలో ఉన్న సారెడ్డి గంగాధర్‌రెడ్డి, సారెడ్డి పార్థసారథిరెడ్డి, భూమిరెడ్డి పురుషోత్తంరెడ్డి, పోచంరెడ్డి రఘునాథ్‌రెడ్డి, తిప్పిరిపాటి రమేష్ , షేక్ బాషా, జగదీశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణ, రమేష్ వైసిపి నుంచి టిడిపిలో చేరారు. టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె వెంకటరామిరెడ్డి, తూగుట్ల మధుసూదన్‌రెడ్డి వీరిని చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వైసిపి నుంచి టిడిపిలోకి వలసలు మొదలయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ వస్తుండడంతో టిడిపి పార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారన్నారు. పార్టీలో చేరిన సారెడ్డి గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ముందు ఉందని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో నాయకులు, కార్యకర్తలను జగన్మోహన్‌రెడ్డి విస్మరించారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని, ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. దీపావళికి దీపం పథకం ద్వారా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రఘునాథరెడ్డి, పార్థసారథిరెడ్డి, సిద్ధారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, దేవిరెడ్డి సంజీవరెడ్డి, అమర్, టైగర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం పునరుద్ధరణ

ఎఇకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక రైల్వేగేటు వద్ద మంగళవారం మధ్యాహ్నం నల్ల కార్బన్ పౌడర్ లోడుతో వెళుతున్న లారీ అంగట్లోకి దూరిన ఘటనలో విద్యుత్ స్తంభాలు విరిగి తీగలు తెగిపోయాయి. రెండు రోజులుగా విద్యుత్ లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై లారీ అడ్డుగా నిలిచిపోవడంతో కాలనీ వాసులకు ఆర్టీపీపీ వెళ్లే వాహనాల రాకపోకలకు విద్యుత్ మరమ్మతులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఆర్టిపిపి వెళ్లే దారిలోని కాలనీ వాసులు విద్యుత్ సరఫరా లేక రాత్రి వేళల్లో అంధకారంలో ఉంటున్నారు. వర్షంలో దోమలతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ మరమ్మతులు చేపట్టి కరెంట్ సౌకర్యం పునరుద్దరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఆ మేరకు వారు బుధవారం విద్యుత్ కేంద్రం వద్ద ఆ శాఖాధికారులకు వినతిత్రమిచ్చారు. ఇందకు ఎఇ శ్రీనివాసరాజవర్మ స్పందిస్తూ వీలైనంత త్వరగా కరెంట్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు. పనులు చేపట్టేందుకు లారీ అడ్డుగా ఉందన్నారు. అంగట్లోకి లారీ దూసు కెళ్లడంతో జరిగిన నష్టాన్ని ఇవ్వాలనే డిమాండ్‌తో బాధితులు లారీని పక్కకు తొలగించడానికి ఒప్పుకోలేదు. దీంతో లారీ రోడ్డుకు అడ్డుగా ఉంది.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు : రైల్వే గేటు వద్ద లారీ ఢీకొని ఆర్‌టిపిపి రోడ్డులోని కాలనీలో విద్యుత్ స్తంభాలు విరిగి పోయిన ప్రదేశాల్లో బుధవారం సాయంత్రం విద్యుత్ ఎఇ శ్రీనివాసరాజ వర్మ ఆధ్వర్యంలో సిబ్బంది కొత్త స్తంభాల ఏర్పాటు, తీగలు లాగే పనులు మొదలెట్టారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న అధికారులు

పెట్రోల్ బంకుల్లో అమలుకాని నిబంధనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వ్యాపార లాభార్జనే ధ్యేయంగా పెట్రోలు బంకుల యజమానులు నిబంధనలు పాటించడంలేదు. వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం విధించిన అనేక ప్రమాణాలున్నా వాటిని పాటించడం లేదు. నిబంధనలు మాకా అంటూ నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారు. బంకుల నిర్వహణ0లో కనీస ప్రమాణాలను సైతం పక్కన పెట్టి వ్యాపారం సాగిస్తున్నారు. కొన్నిచోట్ల కొలతల్లో తేడాలు చేస్తూ కాసులు వెనకేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల కల్తీ పెట్రోలు, డీజిల్ అమ్ముతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. నిరంతరం బంక్‌ల్లో తనిఖీలు చేయాల్సిన సంబంధిత శాఖల అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. సంబంధిత యజమానులు వినియోగదారులకు ఉచితంగా పలు సేవలను అందించాల్సిన ఉంది. ఆ సేవలు అందేలా చూడడంతోపాలు ఆయా నిబంధనలు పాటించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఎక్కువ శాతం బంక్ యజమానులు ప్రభుత్వం విధించిన నిబంధనలేమీ పాటించడం లేదనే ఆరోపణలు వినియోగదారుల నుంచి తరచూ వినిపిస్తున్నాయి. నిర్వాహకులు నిర్దిష్టంగా కొన్ని ప్రమాణాలు పాటించాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా వాటిని పెడచెవిన పెడుతున్నారు. కనీసం మరుగుదొడ్ల నిర్వహణ కూడా సక్రమంగా నిర్వహించలేకపోతున్నాయి. సిబ్బంది మాత్రమే వినియోగించుకునేలా మరుగుదొడ్లను ఉంచుతున్నారు. పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించకుండానే ఉన్న వారిపైనే పని ఒత్తిడి పెంచుతున్నారు.

నామమాత్రపు తనిఖీలకే పరిమితమా..?

పెట్రోల్, డీజిల్ నాణ్యత, కొలతలను పరిశీలించడమే కాక అక్కడ మౌలిక సదుపాయాలు ఉన్నాయా.. లేదా అనే అంశాలపై నిత్యం అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. ప్రతి బంక్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం కచ్చితంగా ఉండేలా యాజమాన్యాలు చూడాల్సి ఉంది. బంక్ వద్ద విద్యుత్ తీగలు బయటకు కనిపించకుండా ఉండాలి. హైటెన్షన్ విద్యుత్ తీగలు లేకుండా చూసుకోవాలి. పెట్రోల్ వేసే సంపుల వద్ద డ్రై కెమికల్ పౌడర్ (డిసిపి), ఫామ్ ఎస్టింమిషల్, బకెట్లలో ఇసుక, నీరు నింపే విధిగా ఉంచాలి. 6 పైపుల నుంచి ఆపై సంపులు ఉన్న పెద్ద బంకుల్లో 50కిలోల కెపాసిటీ గల డిసీస్, 10 వేల లీటర్ల కెపాసిటీ గల నీటి ట్యాంకు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని సౌకర్యాలు ఉండాలి. ప్రతి బంక్‌కు మూడు వైపులా ఆరడుగుల ఎత్తున ప్రహరీ ఉండాలి. వాహనాల చక్రాల్లో గాలిని సరి చూడాలి. తక్కువైతే ఉచితంగా నింపాలి. జాతీయ రహదారిపై ఉన్న బంకుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసరంగా చికిత్స అందించేందుకు. ప్రథమ చికిత్స అందుబాబులో ఉండాలి. నాణ్యతను పరిశీలించడానికి హైడ్రో థర్మా మీటరును అందుబాటులో ఉంచాలి. వాహనం చోదకులు అడిగితే ఇవ్వాలి. పెట్రోల్ పరిమాణాన్ని కొలిచే పరికరాల్ని వాహనదారుల కోసం అందుబాటులో ఉంచాలి. తాగునీటి సౌకర్యం కచ్చితంగా అందేలా చూసుకోవాలి. ఉచితంగా అందించే సేవలపై ఆవరణలో విధిగా బోరు ఏర్పాటు చేయాలి. అయితే అనేక బంక్‌లో అలాంటి సౌకర్యాలు ఎక్కడా కనిపించవు. వీటిపై ఆయా యాజమాన్యాలకు సూచనలు ఇవ్వడంతోపాటు వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది. 70 శాతం బంక్‌ల్లో మరుగుదొడ్ల సౌకర్యాలే ఉండడం లేదు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఉర్దూ సెమినార్‌కు సత్తార్, మగ్బుల్

ప్రజాశక్తి-కడప అర్బన్ : నంద్యాల మజ్లిసుల్ వల్ ఆయిామా (ఇమాముల సంఘం) ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ అంజుమన్ షాది ఖజానాలో జరగనున్న ప్రముఖ ఉర్దూ సాహితి వేత్త, సంఘ సంస్కర్త సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన సీమ స్థాయి ఉర్దూ సెమినారుకు కడప ఉర్దూ సాహితి వెత్తలు సత్తార్ ఫైజి, మగ్బుల్ అహ్మద్‌లకు నిర్వహకులు హఫీజ్ అంజద్ బాష తరపున ఆహ్వానం అందింది. వారు పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు. కర్నూలు డాక్టర్ అబ్దుల్ హఖ్ ఉర్దూ యూనివర్సిటీ ఆచార్య డాక్టర్ సుల్తాన్ మొహిద్దీన్, అపూట రాష్ట్ర కన్వీనర్ సి.అబ్దుల్ అజీజ్ కూడ పాల్గొని పరిశోధన వ్యాసాలు సమర్పిస్తారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర న్యాయ శాఖా, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫారూఖ్ పాల్గొననున్నారు

నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల సభ్యులు

బ్రాందిషాపు వద్దంటూ నిరసన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని విద్యార్థి యువజన ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ మేరకు బుధవారం సంఘం సభ్యులు విగ్రహం వద్ద వర్షంలో తడుస్తూనే నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కత్తి ఓబులేసు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పాత బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం వెనకాల మందుబాబుల కోసం ఏర్పాటు చేసిన భారత్ వైన్స్‌ను రద్దు చేయాలని కోరారు. ఇక్కడ ఎక్కువగా జనసంచారం ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులు, గ్రామాలకు వెళ్లే మహిళలు ఈ షాపు వల్ల అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇక్కడ వైన్ షాపు ఉండేదని, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన అనంతరం గత ప్రభుత్వం వైన్‌షాపును ఎత్తేసిందన్నారు. మళ్లీ ప్రయివేట్ వ్యక్తుల ఆధీనంలో ఇక్కడే బ్రాందీషాపును ఏర్పాటు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని ప్రొద్దుటూరు ఎక్సైజ్ శాఖ సిఐ, ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కలెక్టర్, జిల్లా ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇదే ప్రాంతంలో అంజనేయస్వామి గుడి, రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయని వివరించారు. వీటన్నిటి దృష్ట్యా ఇక్కడి బ్రాందీ షాపును తక్షణం ఎత్తేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ములపాకు ప్రతాపరెడ్డి, పుల్లయ, దాసు పాల్గొన్నారు.

వర్షంలో పంట కోతలు చేపట్టొద్దు

ప్రజాశక్తి-రామాపురం

ప్రస్తుతం వరి, వేరుశనగ పంటల కోత సమయమని, వర్షాలు కురుస్తున్న సమయంలో పంట కోతలు చేపట్టవద్దని మండల వ్యవసాయ అధికారి వైజనాగరాణి రైతులకు సూచించారు. మండలంలోని గోపగుడిపల్లి కల్పన చెరువు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈసంద˘ర్భంగా ఎఒ మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, వేరుశనగ పంట కోతద శలో ఉన్నాయని వర్షాలు పడేటప్పుడు పంట కోతలు చేపట్టవద్దని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తునంతో వరి పొలాల్లో నీరు నిలువ లేకుండా కాలువలతో నీటిని బయటికి పంపాలన్నారు. వరి గింజ రంగు మారకుండా ఉండేందుకు కార్బెండిజం ఒక గ్రామం మ్యాంకోజాబ్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. వర్షానికి వరి కంకులు మొలకలు రాకుండా ఉండడానికి ఉప్పు ద్రావణం కంకుల పై పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కూలీలకు ఆహార భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వ్యవసాయ కూలీలకు ఆహార, జీవనోపాధికి భద్రతను కల్పించాలని వారి ఆకలని తీర్చాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి కె.శోభ తహశీల్దార్ ధనుంజయులకు వినతి పత్రాన్ని అందించారు. మంగళవారం ప్రపంచమంతా ఆహార దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నారని, కానీ అందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆహార దినోత్సవాన్ని ఆకలి దినంగా పరిగణిస్తోందని పేర్కొన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్య ప్రజలు కొని తినలేని పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. కూలీలకు పని లేక, పనికి తగిన వేతనం అందక, కుటుంబాలను పోషించుకోలేక కూలీలు భూమిలేని కూలీలగానే మిగిలిపోతున్నారని తెలిపారు. కూలీలకు తగినంత పని కల్పించి, వేతనాలు సక్రమంగా అందేలా, పౌష్టికాహారం కూలీలకు అందు బాటులో ఉండేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు రోజుకి రూ.850 కూలిగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళా కూలీలకు ప్రసూతి ప్రయో జనం కింద ఆరు నెలల పాటు పదివేల రూపాయల చొప్పున అందించా లన్నారు. సొంత ఇల్లు లేని ప్రతికూలీకి ఇంటిని మంజూరు చేయాలన్నారు. మండలంలోని 22 ఎస్‌సి, ఎస్‌టి నివాస ప్రాంతాలలో శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పీలేరులో 'విరామం' లఘుచిత్ర నిర్మాణం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో 'విరామం' లఘుచిత్రం నిర్మాణం ప్రారంభమైంది. శిబ్బాల అరుణ సమర్పణలో విజయ్ క్రియేషన్స్ పీఎల్ఆర్ బ్యానరుపై విరామం లఘు చిత్రం ముహూర్తం బుధవారం పీలేరు మండలం, ఎర్రగుంటపల్లిలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో చేశారు. ట్రయాంగిల్ లవ్ స్టోరీ బ్యాక్ డ్రాప్ లో స్నేహం, ప్రేమ, నమ్మకం కథాంశంలో చిత్ర నిర్మాణం చేపట్టినట్లు దర్శకులు ఎస్.కె. సురేష్, నిర్మాత ఎస్.విజయ్ కుమార్ తెలిపారు.